క్లుప్తంగా

చలికాలంలోనూ ముంజులు, వేపకాయలు


స్థానిక దుంపగడప రోడ్డులోని రైల్వే గేటు వద్ద ముందే కాసిన తాటి ముంజులు

ఆకివీడు: ప్రకృతిలోని కొన్ని వింతలు అప్పుడప్పుడూ తారసపడుతూ అబ్బురపరుస్తాయి. కాలం కాని కాలంలో కాయలు కాసేస్తున్నాయి, పువ్వులు పూసేస్తున్నాయి. హైబ్రీడ్ చెట్లకు కాసే కాయలు ఏడాది పొడవునా కాస్తాయనడంలో సందేహం లేదు. అయితే సహజసిద్ధమైన చెట్లు కూడా కాలం కాని కాలంలో కాయలు కాసేస్తున్నాయంటే విచిత్రమే మరి. తాటి చెట్టుకు ముంజుకాయలు మార్చి, ఏప్రిల్ నెలల్లో కాస్తాయి. తరువాత అవి తాటి పండ్లుగా అవుతాయి. రెండు నెలల క్రితం నుంచే కొన్ని చోట్ల తాటిచెట్టు కాయలు కాసేసి, పండ్లుగా మారుతున్నాయి. అదే విధంగా వేప చెట్టు కూడా వేప పూత, కాయలు కాసేస్తున్నాయి. వీటిని చూసిన వారంతా కాలం మారింది అంటూ ముక్కున వేలు వేసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ల తనిఖీ


కోపల్లెలో పింఛను పొందుతున్న వృద్ధుడిని పరిశీలిస్తున్న డాక్టర్ల బృందం

కాళ్ల: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్‌లో పింఛన్లు పొందుతున్న వారి వివరాల సేకరణకు సంబంధించిన తనిఖీని వైద్యుల బృందం శుక్రవారం చేపట్టినట్లు కాళ్ల మండలం ఎంపీడీఓ జి.స్వాతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఆరోగ్య పింఛన్ లబ్ధిదారుల తనిఖీలో భాగంగా మొదటి రోజు మండలంలోని 10 గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులను తనిఖీ చేసారని తెలిపారు. బొండాడ, బొండాడపేట, పెదఅమీరం, జక్కరం, కోపల్లె, కొలనపల్లి, ఎల్.ఎన్ పురం, సీసలి, వేంపాడు గ్రామాల్లో వైద్య బృందం పర్యటించి మొత్తం 24 పెన్షన్లు తనిఖీ చేశారన్నారు. మిగిలిన గ్రామాలకు సంబంధించి శనివారం తనిఖీ చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో స్టేట్ టీమ్ డాక్టర్లు జి.రవికుమార్, సుహాస్ ఎస్.సునీల్, డి.సునీత, మెడికల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని వన్‌టౌన్‌లోని నరసయ్య అగ్రహారం ప్రాంతంలో మరణించిన వ్యక్తికి మానవతా సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసుల విజ్ఞప్తి మేరకు అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించామని సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన్ వర్మ (పూనా రామం), చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-చైర్మన్ కార్మూరి నరసింహమూర్తి (బాబు), కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ అల్లు శ్రీనివాస్, కానిస్టేబుల్ కడలి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఘనంగా మావుళ్లమ్మ వార్షిక మహోత్సవాలు


అమ్మవారి ఆలయం వద్ద బుర్ర కథ ప్రదర్శన

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి 61వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలు అలరించాయి. గొర్రెల రాము అండ్ పార్టీ రామచంద్రపురం వారిచే ప్రదర్శింపబడిన బుర్రకథ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే రాత్రి 9 గంటలకు శ్రీ శ్రీనివాస చైతన్య కళ నాట్యమండలి గుంటూరు వారిచే ప్రదర్శించబడిన వీర బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటకం ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

మద్యం విక్రయదారుడి అరెస్టు

భీమవరం: వీరవాసరం మండలం బలుసుగొయ్యలపాలెంలో ఇళ్ల నెలబాలుడు అనే వ్యక్తిని అక్రమం మద్యం కలిగి ఉండడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.బాలరామరాజు ఆదేశాలతో ఎస్సైలు పి.వి.వి.ఎస్ ఉమామహేశ్వరరావు, పి.సునీల్‌కుమార్ అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అధ్వానంగా రహదారులు

- నరకానికి నకళ్లుగా మారిన భీమవరం రహదారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- ప్రధాన సెంటర్లన్నీ గోతులమయం
- ప్రయాణానికి భయపడుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


రాళ్లు లేచిపోయి ప్రమాదకరంగా ఉన్న వేండ్ర కెనాల్ రోడ్డు


ఛిద్రమైన శ్రీరాంపురం-బలుసుమూడి రోడ్డు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మున్సిపాలిటీకి చెందిన ప్రధాన రహదారులు అధ్వానంగా మారడంతో రోడ్లపై ప్రయాణించాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో పట్టణ ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రధాన రహదారుల పరిస్థితి చెప్పనవసరం లేదు. కనీసం పట్టణంలో ప్రధాన కూడళ్లలో కూడా గోతులు పూడ్చే వారు కరువైపోవడంతో భీమవరం ప్రజలకు మాత్రం కష్టాలు తప్పడం లేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధుల మంజూరు

గత ప్రభుత్వంలో రూ.1.90 లక్షలతో భీమవరం, వేండ్ర కెనాల్ రోడ్డుకు శంకుస్థాపన చేయగా సదరు కాంట్రాక్టర్ గోతులు పూడ్చి తారు వేయకుండా నెలల తరబడి వదిలేశారు. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ సుమారు రెండు నెలల క్రితం గోతులు సరిచేసి బూడిదతో కూడుకున్న గ్రావెల్ వేశారు. ఇప్పటికీ తారు వేయకపోవడంతో రోడ్డుపై గ్రావెల్ విపరీతంగా లేచిపోయి ప్రమాదాలకు కారణమవుతోంది. రోడ్డంతా రాళ్లు లేచిపోవడం వల్ల ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారు. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధులు మంజూరు చేసినా పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించకపోవడంపై వాహనదారులు మండిపడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇంకెంత కాలం రాళ్లు, దుమ్ము వల్ల ఇబ్బంది పడాలని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

నిధులు పుష్కరం.. రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం

భీమవరంలో జువ్వలపాలెం రోడ్డు నుంచి బలుసుమూడి వెళ్లే ప్రధాన రహదారి గోతులమయంగా ఉండడంతో వాహనదారులు, పట్టణ ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రోడ్డులో కేవలం గుంతలు పూడ్చి వదిలేశారు. దాంతో ఆ రోడ్డులో ప్రయాణిస్తున్న వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు తప్పడం లేదు. ఇతర వాహనాలు వెళ్తే వెనుక విపరీతమైన దుమ్ము రేగడంతో వాహనదారులు, రోడ్డుకు ఆనుకుని ఉన్న దుకాణదారులు అవస్థలు వర్ణతీతం. ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ నిధులు సుమారు రూ.3 కోట్లు కేటాయించారు. ఇప్పటి వరకూ సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. నిధులు పుష్కలంగా ఉన్నా మున్సిపాలిటీలో రోడ్ల అభివృద్ధికి సంబంధించి తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నారు.

ఆరు నెలలుగా అభివృద్ధి పనులు నిల్

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరు నెలల నుంచి భీమవరం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టలేదు. భీమవరం మున్సిపల్ కార్యాలయం చుట్టూ సీసీ రోడ్లు నిర్మించి పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు అవసరమైన ప్రాంతా నిర్మించలేదు. దీంతో పట్టణంలో పలు చోట్ల రోడ్లు, డ్రెయిన్ల సమస్యలతో పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో మొదట ఆరు నెలల్లోనే భీమవరంలో రూ.30 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశారు. ఇప్పటికీ ఆ అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయి తప్ప కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఎక్కడా కానరాడం లేదు.

పోగొట్టుకున్న పాకెట్ పర్స్‌ను అప్పగించిన పోలీసులు


పర్స్‌ను యజమానికి అందజేస్తున్న పోలీసులు

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మావుళ్లమ్మవారి ఆలయం సన్నిధిలో నిర్వహిస్తున్న ఉత్సవాలను తిలకించేందుకు అమలాపురానికి చెందిన కుటుంబ సభ్యులు శుక్రవారం ఆలయానికి వచ్చారు. అమ్మవారి సన్నిధి ప్రాంగణంలో వారు విలువైన పాకెట్ పర్స్‌ను పోగొట్టుకుని దిక్కుతోచక ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్ పోస్టులో విధుల్లో ఉన్న సామ్యూల్ రాజుకు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయడంతో ఏఎస్సై బాజీ స్పందించి భీమవరం వన్ టౌన్ పోలీస్ సిబ్బందితో కలిసి ఎంతో చాకచక్యంగా వ్యవహరించి పర్స్ చేజిక్కించుకుని సంచరిస్తున్న వ్యక్తిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పాకెట్ పర్స్‌ను అమలాపురానికి చెందిన వ్యక్తికి భద్రంగా పోలీస్ అవుట్ పోస్ట్‌లో శామ్యూల్ రాజ్ ఆధ్వర్యంలో అప్పగించారు. ఈ సందర్భంగా భక్తులు పోలీసులను అభినందించారు. పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు తమ వస్తువులను, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ హెడ్ కానిస్టేబుల్ చల్లా శేషావతారం పాల్గొన్నారు.

దానేశ్వరి అమ్మవారికి సారె సమర్పణ


గుమ్ములూరు రోడ్డులోని దానేశ్వరి వార్షికోత్సవం సందర్భంగా సారెతో వెళుతున్న మహిళలు

ఆకివీడు: స్థానిక దానేశ్వరి అమ్మవారి 25వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక మాదివాడలోని గంగానమ్మ, మద్దిరావమ్మ ఆలయం నుంచి గుమ్ములూరు రోడ్లలోని అమ్మవారి ఆలయానికి చలువ బట్టలతో మహిళలు సారె, చీర, పసుపు కుంకుమ, పండ్లు, చలివిడి కావిళ్లతో భారీ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద సంకష్టహర చతుర్థి వ్రతం నిర్వహించారు. 18వ తేదీన ఆలయం వద్ద విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారధన, సాయంత్రం వరకూ ప్రత్యేక పూజలు చేయనున్నారు. 20న చండీ పారాయణ, చండీ హోమం, పూర్ణాహుతి, దీపోత్సవం, సాయంత్రం 4 గంటలకు 160 కిలోల పసుపు, కుంకుమతో గంగానమ్మ గుడి దగ్గర నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి, దానేశ్వరి అమ్మవారికి పసుపు, కుంకుమార్చన చేయనున్నారు. 21న దానేశ్వరి అమ్మవారి సంబరం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బి.జలదుర్గా ప్రసాద్ తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి అభయ హస్తంలా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే ఎమ్మెల్యే కార్యాలయంలో నాలుగురు లబ్ధిదారులకు రూ.9,93,265 సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అంజిబాబు అందజేశారు. కొత్త పూసలమర్రుకు చెందిన మోకా రజనీశ్రీ, మోకా లక్ష్మి రూ 58,084, దుర్గాపురంకు చెందిన పుప్పాల కృష్ణ రూ 2,89,027, రాయలంకు చెందిన కోళ్ల రత్నకుమారి రూ 1,96,796, భీమవరంకు మామిడి శ్రీరాములు రూ 4,49,358ల చొప్పున మొత్తం రూ.9,93,265ల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, యర్రంశెట్టి శివకృష్ణ, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్సంగ సమావేశాలు ప్రారంభం


సత్సంగ సమావేశంలో పెద్దలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం త్యాగరాజ భవనంలో శ్రీబాబు భక్త సమాజ్, తుమ్మలపల్లి శివ ఆధ్వర్యంలో సత్సంగ సమావేశాలు ప్రారంభమైయ్యాయి. బాబూజీ వారి ఆధ్యాత్మిక వారసులుగా శ్రీకాశీవనాశ్రమ పీఠాధిపతి దేశ విదేశాలలో ఆధ్యాత్మిక దివ్య వాణిని ప్రచారం చేస్తూ భీమవరం పట్టణంలో మూడురోజులపాటు శ్రీమాతాజి దివ్య ప్రభోదం అందిస్తున్నారు. ముందుగా నగర సంకీర్తన, శ్రీశ్రీనివాస రామానుజదాసు ప్రవచనం, అనంతరం సత్సంగ సమావేశం, పూజ్యశ్రీ మాతాజీ వారి దివ్య అనుగ్రహ భాషణం, శ్రీశ్రీనివాస రామానుజదాసుచే ప్రవచనం నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, సయ్యపురాజు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మను దర్శించుకున్న శ్యామలాదేవి


మావుళ్లమ్మవారి సన్నిధిలో శ్యామలాదేవి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మావుళ్లమ్మ అమ్మవారిని ప్రతి సంవత్సరం దర్శించుకుంటానని కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తెలిపారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో బుద్దా మహాలక్ష్మి నగేష్ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మ, వెంకటేశ్వర్లు రాజు, జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఉండి వాసు, మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము పాల్గొన్నారు. అలాగే కర్నూలు జిల్లా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మావుళ్లమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఐసీసీ విజేత మేడపాడు టీం


ఐసీసీ విజేత మేడపాడు టీంకు ట్రోఫీని అందిస్తున్న అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత కుమార దత్తాత్రేయవర్మ

యలమంచిలి: ఇలపకుర్రు క్రికెట్ టోర్నమెంట్ (ఐసీసీ) ట్రోఫీని మేడపాడు టీం సాధించింది. సంక్రాంతి సందర్భంగా 10 రోజులుగా నిర్వహించిన ఈ టోర్నమెంటులో మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. మేడపాడు, ఇలపకుర్రు జట్ల మధ్య శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇలపకుర్రు జట్టు 14 ఓవర్లలో 81 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మేడపాడు జట్టు 13.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసి విజయం సాధించింది. విజేతలకు ట్రోఫీతోపాటు రూ.15 వేలు, రన్నర్స్‌కు ట్రోఫీతో పాటు రూ.10 మే అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా మేడపాడు ప్లేయర్ చీడే వెంకటేష్, బెస్ట్ బ్యాట్‌మెన్‌గా గంగులూరి కల్యాణ్, బెస్ట్ బౌలర్‌గా చీడే భాస్కర్‌లు నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేసిన టోర్నమెంట్ నిర్వాహకుడు, గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ మాట్లాడుతూ యువకులు జూద క్రీడల వైపుకు వెళ్లకూడదనే ఆశయంతోనే ఏటా ఇలపకుర్రులో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రహదారి ప్రమాదాలను నివారించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): రహదారి ప్రమాదాలు నివాలరించాలని ప్రజా రవాణా అధికారి ఎన్.వి.ఆర్. వర ప్రసాద్ తెలిపారు. భీమవరం ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు డిపో మేనేజర్ పి.ఎస్.వి.ఎం.సత్యనారయణమూర్తి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించాలన్నారు. ముఖ్యంగా డ్రైవర్లు విధి నిర్వహణలో తగు జాగ్రత్తలు పాటిస్తే ప్రయాణికుల ఆదరణ పెరుగుతోందన్నారు. ఆర్టీఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యపానం, అతివేగం ఈ మూడింటికి ప్రతీ డ్రైవర్ దూరంగా ఉండాలన్నారు. భీమవరం 1 టౌన్ సీఐ నాగరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి సువార్త సభలు

ఉండి: కలిసిపూడి క్రీస్తు సంఘం చర్చి గ్రౌండ్‌లో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు రక్షణ సువార్త మహాసభలు నిర్వహిస్తున్నట్లు సభల కన్వీనర్ బ్రదర్ కె.సతీష్ శుక్రవారం తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు నిర్వహించే ఈ సభలకు ప్రసంగీకులుగా బ్రదర్ గ్రేస్ విక్టర్ (పాలచర్ల), డాక్టర్ కే ఉపేందర్ (ఖమ్మం), సిస్టర్ కాంతికళ (బలభద్రపురం) హాజరువుతున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా బ్రదర్ వై డేవిడ్‌రాజు (ఆకివీడు), ప్రీచర్ డి అబ్రహం (కలసిపూడి) హాజరువుతారని తెలిపారు.

19న కార్మిక కర్షక ఐక్యత దినోత్సవం

భీమవరం: వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘాల సంయుక్త సమావేశం శుక్రవారం ప్రజా సంఘాల కార్యాలయంలో జక్కంశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గోపాలన్ మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. అన్ని పంటలకు రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇవ్వాలని కోరారు. అఖిలభారత కమిటీలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 19వ తేదీన ప్రకాశం చౌక్ సెంటర్లో సభ జరుగుతుందని ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎం ఆంజనేయులు ఎ అలమహారాజు ఇంజేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి సురభి నాటక పోటీలు

ఉండి: ఈ నెల 20 నుంచి 23వ తేదీ బుధవారం వరకు సురభి నాటక పోటీలు జరుగుతాయని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. గ్రామంలోని సంతాన గోపాలస్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నాటక పోటీల్లో నాలుగు అంశాలపై నాటకాలు ప్రదర్శించవచ్చని తెలిపారు. ప్రతిరోజు రాత్రి 7 గంటలకు నాటకాలు ప్రారంభమవుతాయని, అభిమానులు ఈ పోటీలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

70 శాతం వరి నాట్లు పూర్తి

భీమవరం అర్బన్: మండలంలో 8వేల 400 ఎకరాలకు గాను సుమారు 70 శాతం వరినాట్లు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. దిరుసుమర్రు, యనమదుర్రు, తాడేరు, కొమరాడ, అనాకోడేరు, చినఅమిరం, రాయలం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం గ్రామాల్లో దాళ్వా వరినాట్లు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. బేతపూడి, తుందుర్రు, తాడేరు గ్రామాల్లో వరినాట్లు పూర్తి కావాల్సి ఉందని చెప్పారు. దాళ్వా వరినాట్లు ఇప్పుడు త్వరితగతిన పూర్తి చేయకపోతే పంట కోత సమయంలో మార్చి, ఏప్రియల్ నెలల్లో పంట కాలువల కట్టేయడంతో వచ్చే నీటి ఎద్దటికి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. రైతులు ముందుగానే వరినాట్లు పూర్తి చేయాలని కోరారు. వరినారి దొరకని పక్షంలో వెదజల్లే పద్ధతిని అనుసరించాలని ఈ విధానం వల్ల పంట రెండు వారాలు ముందుగాను, సాగులో రూ. 3 వేలు నుంచి 6 వేలు వరకు ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు.

21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉండి: ఈ నెల 21వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు మండలపరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఉండి ఎంపీడీవో ఎస్ రవీంద్ర తెలిపారు. ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, ఇతర అంశాలపై చర్చ ఉంటుందని ఆయన శుక్రవారం తెలిపారు.ఈ సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ


ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: రాష్ట్ర జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ 3వ అదనపు జిల్లా జడ్జి ఎం.ఎ సోమశేఖర్ అధ్యక్షతన భీమవరం కోర్టు ప్రాంగణంలో శుక్రవారం అయిదుగురు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హెల్మెట్ల యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగినా ప్రాణాపాయం ఉండదన్నారు. సామాజిక సేవా దృక్పథం తో హెల్మెట్లు పంపిణీకి ముందుకు వచ్చిన రిటైర్డ్ ఉద్యోగులు, సంస్థ పారా లీగల్ వలంటీర్లు అయిన షేక్ చాన్ బాషా, పి.సూర్యనారాయణలను ప్రత్యేకంగా అభినందించారు. పారా లీగల్ వలంటీర్ ఓ.చంద్రరావు హెల్మెట్ల పై అవగాహన గీతాన్ని పాడి వినిపించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి

వీరవాసరం: సంక్రాంతి సందర్భంగా కళలు ఆటలు వంటి నైపుణ్యాలను గుర్తించి యువతను ప్రోత్సహించాలని దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఐటియూ జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు అన్నారు. సంక్రాంతి సందర్భంగా వీరవాసరంలో పాటల పోటీలు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆంజనేయులు మాట్లాడుతూ సంక్రాంతి అంటే వేరువేరు అర్థాలను తీసి ప్రజాప్రతినిధులే పక్కదారి పట్టించే సంస్కృతి ప్రారంభమైందని ఇది బాధాకరమైన విషయమన్నారు. చాలా ఏళ్లుగా యువజన విద్యార్థి ప్రజా సంఘాలు యువతను ప్రోత్సహించే ఆటల పోటీలను గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేవలం సరదా కోసమే కాకుండా యువతలో ఉండే నైపుణ్యాలను వెలికి తీసేందుకు, ప్రతి ఒక్కరి ప్రతిభను అందరి ముందు ప్రదర్శించేందుకు వేదికగా ఆటల పోటీలు జరిగేవని అన్నారు. సంప్రదాయాలను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటియూ జిల్లా నాయకులు ఇంజేటి శ్రీనివాస్ మండల నాయకులు నాగరత్నం, సత్యవతి, శాంతి కుమారి, ప్రసన్న, బేబీ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి బసుకు ఘన నివాళి


జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

భీమవరం: కమ్యూనిస్టు పార్టీ తొలితరం నాయకులు, సీపీఎం నేత పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు14వ వర్ధంతి స్థానిక సుందరయ్య భవనం వద్ద జరిగింది. జిల్లా కార్యదర్శి జె.ఎన్‌వి గోపాల్ జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ జ్యోతిబసు దేశ రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషించారన్నారు. భారత దేశ చరిత్రలో ఏపార్టీకి లేని ఘనత సీపీఎం పార్టీకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతి బాబు, ఇంజేటి శ్రీను, కార్యకర్తలు మల్లిపూడి ఆంజనేయులు, బి.అలమహారాజు, దత్తు, కె.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

వారానికోసారి డ్రైడే పాటించాలి


తణుకులో ఇంటి పరిసరాల్లోని డ్రమ్ములో నీటి నిల్వలను తొలగిస్తున్న వైద్య శాఖ సిబ్బంది

తణుకు అర్బన్: వారానికోసారి డ్రైడే పాటించే విధానాన్ని ప్రతి ఒక్కరూ పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, ఇంద్రయ్య నగర్ ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాట్లాడారు. జీవన విధానంలో ఆరోగ్యకరమైన అలవాట్లలో భాగంగా ప్రతి శుక్రవారాన్ని శుభవారం, పొడి వారంగా పాటించడం, డ్రెయిన్లలో చెత్త వేయకుండా ఉండడం ద్వారా దోమ పుట్టుకకు చెక్ పెట్టాలని సూచించారు. దోమ తెరలు వాడడం, శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించడం వంటి జాగ్రత్తలు పాటించి దోమ కాటు నుంచి రక్షణ పొందాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్యానికి సమతుల ఆహారం తీసుకోవాలని వివరించారు.